

జ్యోతి, తహసీల్దార్, అయిజ

ఆర్థిక స్వతంత్రం తప్పనిసరి

సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో సమర్థవంతాగా రాణిస్తున్నారని అయిజ తసహసీల్దార్ జ్యోతి అన్నారు. మహిళల ఎదుగుదలకు ఆర్థిక స్వతంత్రం తప్పనిసరిగా ఉండాలని దానికోసం హిళలు ఉన్నత చదువులు చదవాలన్నారు. ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ మహిళల ఎదుగుదలకు దోహదపడుతోందన్నారు. మహిళలు చదువుకోవడం వలన వారి పిల్లలను తీర్చిదిద్దవచ్చన్నారు. మహిళలు ఎంత ఎదిగినా సమాజంలో మహిళల పట్ల కనపడని వివక్షత ఉందని పేర్కొన్నారు.

ధైర్యంగా ముందుకు సాగాలి

ధరూరు: పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ఎంపీడీఓ మంజుల అన్నారు. ప్రతి శాఖలోనూ మహిళలు రాణిస్తున్నారని ప్రస్తుత టెక్నాలజీ వేగంగా దూసుకుపోతున్నా మహిళలపై అఘాయిత్యాలు, వివక్ష అనేది ఇంకా కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులుగా రాణిస్తున్నా మహిళలు పూర్తిస్థాయిలో అధికారాన్ని వినియోగించుకోవడం లేదన్నారు. తనకు అవకాశం వచ్చింది తానే ఈ పనిని 100 శాతం నిర్వర్తించాలన్న పరిపూర్ణ జ్ఞానం వారికి కలగాన్నారు. ప్రతి ఒక్క మహిళ ప్రతి రంగంలో ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. అందుకు ఎదురయ్యే అడ్డంకులను తిప్పికొట్టేందుకు ప్రభుత్వం, చట్టాలు మరింత కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు.



మంజుల ఎంపీడీఓ, ధరూరు

అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అనే చిన్న చూపుతో మహిళలు వివక్షతకు గురవుతున్నారని, మహిళలు బాగా చదివి జీవితంలో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపుతో పాటు ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లలు భారం అనే ఉద్దేశంతో కాకుండా పెంచి పోషించినప్పుడే మహిళలకు సమాజంలో గౌరవ స్థానం ఉంటుందని పేర్కొన్నారు.



డాక్టర్ స్వరూపరాణి, మల్దకల్

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

శాంతినగర్: జాతీయ రహదారికి వెళ్లే మార్గం దగ్గరుందని సంతోషించాలో గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణించాలంటేనే నరకం అనుభ వించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని కోయిల్‌దిన్నె వాసులు, ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు బాగోలేదని గత పదేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులతో మొరపెట్టుకున్నా ఆలకించే నాథుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

12 ఏళ్ల క్రితం బీటీ..

వడ్డేపల్లి మండల పరిధిలోని శాంతినగర్ నుంచి కోయిల్‌దిన్నె మీదుగా జాతీయ రహదారి 44కు వెళ్లే రోడ్డుకు పన్నెండేళ్ల క్రితం బీటీ వేశారు. అప్పటి నుంచి రోడ్డుకు మరమ్మతు మరిచారు. కనీసం ప్యాచ్ వర్క్ పనులు చేపట్టలేదు. హైవే దగ్గరవుతుందని భారీ వాహనాలు, ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు తరచూ వెళ్లడంతో అడుగడుగునా మోకాళ్లలోతు గుంతలు ఏర్పాడ్డాయి. దీంతో బైక్‌లు, ఆటోల్లో ప్రయాణించే వారు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతినిత్యం వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయని పేర్కొంటున్నారు. ఐదు కిలోమీటర్ల రహదారిని దాటి హైవే వైపు వెళ్లాలంటే అరగంటకు పైగా సమయం పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఐదు కిలోమీటర్ల మేర అధ్వాన్నంగా ఉన్న రహదారిని కొత్తగా నిర్మించి ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొన్నారు.

తరచూ ప్రమాదాలు

బీటీ రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా మారడంతో వాహనాలపై వెళ్లే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణించే సమయంలో అటు, ఇటు వాహనాలు తిప్పుతూ వెళ్లడంతో ముందు, వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొనడం లేదా అదుపుతప్పడం జరుగుతుందంటున్నారు.

ప్రమాదభరితంగా కల్వర్టు..

అదే రహదిరిపై గ్రామ సమీపంలోని వాగుపై నిర్మించిన కల్వర్టు ప్రమాదభరితంగా ఉంది. ఇరువైపుల రక్షణ గోడలు లేకపోవడం, కల్వర్టుపై గుంతలు పడటంతో వాహనాలు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉంది. వాహనాలు అదుపుతప్పి వాగులో పడే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలడంతో వాహనాల టైర్ల కింద పడుతూ వాహనాలు అదుపు తప్పడం, కంకరరాళ్లు ప్రయాణికులకు తగలడంతో గాయాల పాలవుతున్నట్లు పేర్కొన్నారు.



గుంతలమయమైన కోయిల్‌దిన్నె రహదారి



కోయిల్‌దిన్నె సమీపంలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

ప్రతిపాదనలు పంపాం..

కోయిల్‌దిన్నె రోడ్డు గుంతలమయమైందని, నిధులు మంజూరు చేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. రోడ్డు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలుపెట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

–రెడ్డప్ప, డీఈ, పంచాయతీరాజ్ శాఖ

బైక్‌పై వెళ్లలేని పరిస్థితి..



దాంబర్ రోడ్డుపై గుంతలు పడటంతో వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయి. చాలా మందికి దెబ్బలు తగిలి ఆస్పత్రుల పాలయ్యారు. శాంతినగర్‌కు బైక్‌పై వెళ్లి రావాలంటే భయమేస్తుంది. ప్రమాదాలు జరిగి ఎవరూ చనిపోకముందే తొందరగా రోడ్డు పనులు చేపట్టాలి.

– మహేశ్వర్ రెడ్డి, కోయిల్‌దిన్నె, వడ్డేపల్లి

మంచాన పడాల్సిందే..



మా ఊరు నుంచి శాంతినగర్‌కు ఆస్పత్రికి, వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటాం. గుంతల రోడ్డులో ఆటోలు, బైక్‌పై ప్రయాణించాలంటే నరకం చూడాల్సి వస్తుంది. దుమ్ము, ధూళితో కొత్త రోగాలు బారిన పడుతున్నాం. అధికారులు రోడ్డు బాగు చేయించి పుణ్యం కట్టుకోవాలి.

–లక్ష్మన్న గౌడ్, కోయిల్‌దిన్నె, వడ్డేపల్లి

గర్భిణులకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సింధు ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో 31మందికి వైద్య పరీక్షలు నిర్వహించి శాంపిల్స్‌ను టీహబ్ వాహనం ద్వారా గద్వాల్‌కు పంపించినట్లు వైద్యులు తెలిపారు. న్యూట్రిషన్, రక్తహీనతపై అవగాహన కల్పించినట్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చంద్రన్న, కృష్ణవేణి, రాణి, రేవతి, నసీమా, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ధరూరు: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మండల విద్యాధికారి రవీంద్రబాబు పరిశీలించారు. శుక్రవారం మండల పరిధిలోని జీరబండ, చింతరేవుల, నర్సన్‌దొడ్డి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా అపార్ నంబర్ ఐడీలు క్రియేట్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

రాజోళి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన బూత్‌అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీజేపీకి ప్రజలు పట్టం కడుతున్నారన్నారు. రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మంచి ఆదరణ లభించి, అధికార కాంగ్రెస్‌పై విజయం సాధించామన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు నగారా మోగించడం ఖాయమన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో చోటు చేసుకున్న పరిణామాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే గ్రామస్థాయిలో ఓటర్లు కూడా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గంతో చర్చలు జరిపి తమ సామాజిక వర్గం తరఫున బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శశి కుమార్, సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, ఈసీ అంజనేయులు, మల్లేష్, అడివిస్వామి, రాజేష్, రాము, రాఘవేంద్ర, వీరేష్, మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మానవపాడు: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రోడ్లపై చెత్తా చెదరాలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ నిందితుల అరెస్ట్

అలంపూర్: అంతర్రాష్ట్ర రహదారిలో కత్తితో బెదిరించి దొంగతనానికి పాల్పడిన నిందితులను పట్టుబడినట్లు అలంపూర్ సీఐ రవిబాబు తెలిపారు. కోదండాపురంలోని సీఐ కార్యాలయంలో దారి దోడిపికి పాల్పడి పట్టుబడిన వారి వివరాలను సీఐ రవిబాబు శుక్రవారం వివరించారు. ఉండవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంపూర్ చౌరస్తాలో ముగ్గురు వ్యక్తులు దారి దోపిడికి పాల్పడినట్లు తెలిపారు. మానవపాడు మండలం కొర్విపాడు స్టేజీకి చెందిన మాదిగ ఫిలేమాన్ అనే వ్యక్తి అలంపూర్ చౌరస్తా సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తన బైక్‌ను రోడ్డు పక్కను నిలిపి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తుండగా అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు స్కూటీపై వచ్చి ఫిలేమాన్‌ను కత్తితో బెదిరించి అతని బైక్, సెల్‌ఫోన్, రూ. 2500 నగదును ఆపహరించినట్లు తెలిపారు. బాధితుడు ఈనెల 5న ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో కర్నూల్‌లోని వాసవీనగర్‌కు చెందిన జగన్‌మోహన్ రెడ్డి, మిటలరీ కాలనీకి చెందిన తిరుపతి సురేష్, కప్పలనగర్‌కు చెందిన గంగాధర్ దోపిడీకి పాల్పడినట్లు తెలిపారు. వారి వద్ద అపహరించిన బైక్, సెల్‌ఫోన్, రూ.2500 నగదును రికవరీ చేసినట్లు ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. నిందితులను అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు విధించినట్లు రెండు రోజుల్లో కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. త్వరలో రివార్డు అందజేస్తామని పేర్కొన్నారు.

మట్టి తరలిస్తే చర్యలు

అయిజ: అనుమతులు మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జ్యోతి అన్నారు. శుక్రవారం మల్దకల్ మండలానికి చెందిన ఇద్దరు రెండు టిప్పర్లతో మట్టిని తరలిస్తుండగా తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్‌రెడ్డి టిప్పర్లను పట్టుకున్నారు. పోలీసుల సహకారంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

ఎర్రవల్లి: మండల పరిధిలోని వల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివలీల హాజరై బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. బాల్య వివాహం జరిపిస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు ఏసమయంలోనైనా టోల్‌ఫ్రీ నంబర్ 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామాల్లో అనాథ పిల్లలు ఉన్నా లేదా బాలల అక్రమ రవాణా గురించి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం బాలల సంరక్షణ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయ్యమ్మ, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ నవీన్, ఏఎస్ఎం భారతి, ఆశాలు, అంగన్‌వాడి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రోత్సహించాలి

అయిజ: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, ఉపాధ్యాయులు వారి నైపుణ్యాన్ని గుర్తించి మెరుగుపరుచాలని ఎంఈఓ రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జీవీఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో కళా మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ రాములు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన వస్తువులు పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులతో విద్యార్థులు అందమైన కళాకృతులను తయారు చేసి ప్రదర్శించడం హర్షించదగ్గ విషయమన్నారు. నిరంతరం విద్యార్థులు తమ కళలను ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

రైతుల ‘పానీపాట్లు’

గట్టు దాకా కాల్వ నీటి మళ్లింపు

గట్టు: యాసంగి పంటలు ఎండిపోకుండా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా ర్యాలంపాడు కాల్వ ద్వారా వచ్చే నీటి ఆధారంగా రైతులు వేరుశనగ, వరి తదితర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట గింజలు గట్టి పడే దశలో ఉన్న తరుణంలో కాల్వ నీరు ఆలస్యం అవుతుండడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ర్యాలంపాడు కాల్వ ద్వారా శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన నీరు గట్టు దాకా రాకుండా అక్కడక్కడ అడ్డుకట్టలు పడుతూనే ఉన్నట్లు వాపోతున్నారు. ర్యాలంపాడు కాల్వకు నీటిని విడుదల చేసినట్లు విషయం తెలుసుకున్న రైతులు మద్దెలబండ సమీపంలో నాగర్‌దొడ్డి వైపు మళ్లించిన కాల్వ నీటిని గట్టు వైపు తిప్పుకొచ్చారు. అయితే ఆరగిద్ద సమీపంలో కొంత మంది రైతులు కాల్వను జేసీబీ సహాయంతో తవ్వేసి నీటిని కుంటలకు మళ్లించడంతో గట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము కష్ట పడి కాల్వ నీటిని మళ్లించుకుని వస్తే, ఆరగిద్ద రైతులు అడ్డుకోవడం సమంజసంగా లేదని వాపోయారు. మండుతున్న ఎండలకు పంటలకు నీళ్లు పెట్టలేక అవస్థలు పడుతున్నట్లు రైతులు వాపోయారు. కాల్వకు నీళ్లు రాకపోతే పంటలు ఎండిపోతాయని, కాల్వకు నీళ్లు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆరగిద్ద సమీపంలో తవ్విన కాల్వ

ఓఎల్‌ఎంఎస్‌పై అవగాహన

ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పురుగు మందుల డీలర్లకు ఓఎల్‌ఎంఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రవికుమార్ పురుగు మందుల డీలర్లకు ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. నకిలీ పురుగు మందులు, కల్తీ, నాసిరకం, అనధికార విక్రయాలను నిలిపి వేసేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి డీలర్ పురుగు మందుల వివరాలను ఓఎల్‌ఎంఎస్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫ్రిజ్ వితరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976– 80 బ్యాచ్‌కు సంబంధించిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.40 వేలు విలువ గల మినరల్ వాటర్ ఫ్రిజ్ అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు హేమలత అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకారెడ్డి, రఫీక్, శర్నయ్య, ఉమాపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీ కనిపించడం లేదా?

రాజోళి: తుంగభద్ర నదిలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ఇసుక దోపిడి జిల్లా అధికారులకు కనిపించడం లేదా అని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జిల్లాలో ప్రజల అవసరాలకు ఇసుకను అందుబాటులో లేకుండా ఉక్కుపాదం పేరుతో ఇబ్బంది పెడుతున్నారన్నారు. జిల్లా సరిహద్దులోకి వచ్చి ఆంధ్రప్రదేశ్ వారు మరబోట్లతో ఇసుక కొల్లగొడుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గ్రామంలో ఎద్దుల బండితో ఇసుకను తెచ్చుకుని పొట్ట పోసుకునే పేదవాళ్లను సైతం ఆ పనికి వెళ్లకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేశారన్నారు. దీంతో వారి జీవనోపాధి దెబ్బతిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక దోపిడిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పీఏసీఎస్‌లో యూరియా కొరత

అలంపూర్ రూరల్: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా కొరత ఉందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు దుకాణాల్లో యూరియా రూ.330 విక్రయిస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో రూ.270కే విక్రయించేవాళ్లమన్నారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై శుక్రవారం ఏఓ నాగర్జున్ రెడ్డిని వివరణ కోరగా యూరియా అందుబాటులో ఉందని రెండు రోజుల్లో రైతులకు యూరియా అందేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ ఫర్టిలైజర్ దుకాణదారులను హెచ్చరించారు. శుక్రవారం మల్దకల్‌లో ఫర్టిలైజర్ షాపు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు, రసాయనాలను విక్రయించాలని ఆదేశించారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడానికి వెళ్లగా ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ బోయ ధనుంజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ధరూరు/గట్టు: జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయురాళ్లను శాలువా, పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సమాజంలో స్త్రీ ప్రాముఖ్యతను పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి వివరించారు. ప్రతి ఒక్కరు స్త్రీలను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు మండల పరిధిలోని బస్వాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని వంట ఏజెన్సీ నిర్వాహకులను జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో మహిళా ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మౌలిక వసతులు కల్పించాలి

అయిజ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులను మండల బీజేపీ నాయకులు శుక్రవారం కలిసి మాట్లాడారు. ప్రయాణ ప్రాంగణంలో వారు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న అయిజ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో అధికారులు మౌలిక వసతులు కల్పించకపోవడంతో దారుణమన్నారు. తాగునీటి సౌకర్యం లేదని, కనీసం నిలవ నీడకూడా ఏర్పాటు చేయలేదని అధికారులపై మండిపడ్డారు. ఆర్టీసీ ప్రాంగణం చిన్నదిగా ఉండడంతో ప్రయాణికులు ఎర్రని ఎండలో మాడిపోతున్నారని వాపోయారు. అధికారులు, పాలకులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. బీజేపీ తరఫున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరేష్, రఘు, వెంకటేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టదా..?

కేటీదొడ్డి: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 104 ప్యాకేజీ కింద ఎండుతున్న పంటలను బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు పరిశీలించారు. శుక్రవారం ఆయన మండల బీఆర్ఎస్ నాయకులు, డీఈ కిశోర్ కుమార్, రైతులతో కలిసి మండల పరిధిలోని గువ్వలదిన్నె, వెంకటాపురం, ఇర్కిచేడు, గంగన్‌పల్లి, ఈర్లబండ, కొండాపురం తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. చివరి ఆయకట్టుకు నీరందక ఓ పక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు, ప్రభుత్వం ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆరుగాలం కష్టించి సాగు చేసుకున్న పంటలు కళ్ల ముందే ఎండుతున్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితి ఈ ప్రాంత రైతులకు ఎదురవుతోందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నీళ్లేమో పాతాలానికి, నిధులేమో ఢిల్లీకి అన్నట్లుగా కనిపిస్తోందన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోనేష్, నూర్ పాషా, శేఖర్, వెంకటటేష్, గంజిపేట రాజు, గోపాల్, తిరుమలేష్, శ్రీనివాసులు, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బాసు హనుమంతునాయుడు

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

ఉండవెల్లి/ఇటిక్యాల/మల్దకల్: ఉండవెల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మునిస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ ఇటిక్యాల మండల పరిధిలోని చాగాపురం మండల పరిషత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.

■ మల్దకల్ మండలంలోని బిజ్వారం హరిజన్ చెర్రి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి, ఉపాధ్యాయులు మల్లికార్జున్, జాకీర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.